# హనీమూన్

పెళ్ళి హడావిడి అయిపోయింది. రామం గదిలో పచార్లు చేస్తు న్నాడు. రాజ్యం పెట్టి మీద కూచుంది. పెళ్ళి బడలిక రాజ్యం కళ్ళలోనే కనిపిస్తోంది. ఆవలించి ఒళ్ళు విరుచుకుంది.

రామానికి చిరాగ్గా, విసుగ్గా, చాలా కోపంగా వుంది.

"ఈ పెద్దాళ్ళెప్పుడూ ఇంతే. సమయం వచ్చినప్పుడు విషయాన్ని తేల్చరు. అయినా పెళ్ళికి ముందు ఈ విషయాలన్నీ మాట్లాడుకోడం అయిందిగా. మళ్ళీ ఇప్పుడేమిటి సమస్య – ఛా .... మంచంమీద వాలాడు. రాజ్యం మెడలో చిక్కుపడ్డ గొలుసుల్ని సరి చేసుకుంటోంది. చేతినున్న గడియారం టైమే కాకుండా తారీఖు కూడా చూపిస్తోంది ఖర్మ – ఇంక కొద్ది రోజుల్లో ఆఫీసు కెళ్ళాలి.

"పెద్దాడు...." గుమ్మంలోంచి అమ్మ కేక పెట్టింది.

చెదిరిన జుట్టు సరిచేసుకుంటూ లేచాడు రామం.

"ఈ ఎండల్లో ఇబ్బంది పడతారేనని కానీ ...." నసిగాడు తండ్రి.

"నువ్వేవన్నా అనుకో .... నాకు మాత్రం ఇష్టం లేదు సుమా – పదహార్రోజుల పండుగ వరకు పిల్ల ఇల్లు కదలకూడదు. ఇద్దరూ ఇంట్లో హాయిగా వుండక ఈ ఊరేగడాలు అవి బావుండవు."

పెద్దత్తయ్య మాటలకి ఏ సమాధానం చెప్పకుండా గదిలోకొచ్చాడు రామం.

"ఇవాళున్న సరదా రేపు ఉంటుందా వాళ్ళకి. ఈ మధ్య కుర్రాళ్ళందరికీ ఇదో సరదా అయింది కదా – పంపించండి" అమ్మ గొంతు గదిలో రామానికి వినిపిస్తోంది. ఎలాగయినా అమ్మే మంచిది.

నాన్నగారు గదిలో కనిపిస్తున్నారు. రామం చూస్తూనే ఉన్నాడు.

"ఊ .... ఆ రిజర్వేషన్ గొడవ చూసుకో - లేకపోతే ఇబ్బంది పడతారు" – తండ్రి గొంతుకి ఉలిక్కిపడ్డాడు.

"చూశావా – మా వాళ్ళు ఎంత మంచివాళ్ళో" - రామం కునుకు తీస్తున్న రాజ్యాన్ని గబ గబా లేపాడు సంతోషంతో.

*   *   *

స్టేషన్‌కి తల్లి తండ్రి. పెద్దత్తయ్య, చెల్లాయి, అంతా వచ్చారు.

"డబ్బు చాలకపోతే ఇబ్బంది పడకు, వైర్ చెయ్యి" నాన్నగారు నెమ్మదిగా రామంతో చెప్పారు. పెద్దత్తయ్య మడిచినపదులు చేతిలో వుంచింది. పెద్దత్తయ్యకి తనంటే ఎందుకో ఇష్టం అనుకున్నాడు రామం.

రైలు కదిలింది, "చూడండి వాళ్ళ ముఖాలు - ఎన్ని వేలు ఖర్చయితేనేం తప్పు లేదనిపిస్తోంది" అంది తల్లి సంతోషంతో. ఊఁ అన్నాడు తండ్రి చెయ్యి ఊపుతూ నడుస్తూ.

*   *   *

మైసూరు, బెంగుళూరు అన్నీ ఇంతకుముందు ఓసారి తను చూశాడు కాని ఒంటరిగా .... ఇప్పుడు చూడ్డంలో బహుశా అవన్నీ ఎంతో కొత్తగా అనిపిస్తాయేమో మరి!! నవ్వుకున్నాడు రామం - ఎదురుగా సీట్లో వున్న ఆవిడ చంటిపిల్ల తెల్లగా బొద్దుగా ముద్దుగా ఉంది. కానీ మరీ ఎదురు సీట్లోనే ఆవిడ వుండబట్టి రామానికి కాస్త చిరాగ్గా ఉంది.

"ఈవిడ ఈ స్టేషన్‌లో దిగితే బావుండును .... లేకపోతే మనకి బోర్" - నెమ్మదిగా అన్నాడు రామం.

"ఆవిడకి తెలుగు కూడా వచ్చినట్టే ఉంది" నసిగాడు.

"లేకపోతే - నా మీద కవిత్వం అల్లి పాడాలనుకుంటున్నారా" బుగ్గలు చిన్న సొట్టలు పడుతూ నవ్వింది రాజ్యం.

"ఇదిగో పిల్లను తీసుకోండి" అంది ఆవిడ పిల్లను అందిస్తూలేస్తూ.

కొత్త ఏమీ లేని పిల్ల నవ్వుతూ వచ్చింది. ముద్దబంతిలా ఉన్న పిల్లని కిల కిలా నవ్వించింది రాజ్యం. పాప నవ్వి నవ్వి పాలన్నీ కక్కేసుకుంది. రాజ్యానికి అసహ్యం వేసింది. చీర మీద కక్కింది.

ఆవిడ పిల్లను అందుకుంటూ "ఎండలు కదండీ - తాగిన పాలన్నీ ఇలాగే కక్కుతోంది" అంది. రాజ్యానికి ఒళ్ళు మండిపోయింది. అయ్యో! చీర మీద కక్కింది - "తుడుస్తానని మర్యాదకన్నా అనదేం" రామం నవ్వుతుంటే రాజ్యం బుగ్గలు ఎరుపెక్కాయి.

*　　　*　　　*

రైలు ఆగడమే తడవుగా కొద్ది సామానుతో ఆటో ఎక్కారు హనీమూన్ కపుల్. ఈ వూరు రామానికి కొత్తేం కాదు కదా. ఇంతకు ముందు తెలిసిన హోటల్ ముందు ఆగారు. ఎక్కడా ఏ సందడీ లేదు. ఇది హోటలే. అనుమానం లేదు మరి. రామాన్ని చూస్తూ ఓ పెద్దమనిషి కన్నడంలో ఏదో చెప్పాడు. పూర్తిగా అర్థం కాని రామం ముఖాన్ని చూస్తూ మళ్ళీ ఆయనే ఇంగ్లీషులో చెప్పాడు.

రామం ముఖం పాలిపోయింది. కాళ్ళ కింద భూమి తల్లకిందు లయింది. స్ట్రైక్ - హోటలన్నీ మూసేసారు!

డైరీలో శేఖరం ఎడ్రసు కళ్ళ ముందు నిలిచింది!

*　　　*　　　*

హల్లో - ఆపద్బాంధవుడిలా వచ్చావ్, ఇదే అంటారు- "ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్" అని శేఖరం చాలా సంతోషంతో లోపలికి తీసుకుపోయాడు

శేఖరం భార్య హాస్పిటల్లో వుంది. మూడో కాన్పు. సిజారియన్ - ఇంకా వారం రోజుల దాకా ఇంటికి పంపరు. ఇప్పటికి నాలుగు రోజుల నుంచి చేతులు కాల్చుకుంటున్న శేఖరం ఓ ఇల్లాలు అడుగు పెట్టగానే పొంగిపోయాడు - కాకపోతే మాత్రమేం - మా రామం భార్య - ఫరవా లేదు.

"నీకు శ్రమే అనుకో మరి - ఈ పిల్లలు కాస్త పేచీ పెడితే రెండు తగిలించు - ఏమీ అనుకోను - ఆ గూట్లో డబ్బాల్లో అన్నీ వున్నాయి మరి సాయం కావాలంటే మా చిట్టిబాబు ఉన్నాడు -" నసుగుతున్నాడు శేఖరం.

"ఫరవాలేదండీ - ఆడవాళ్ళం - ఆ మాత్రం వంటకి భయపడతా ననుకున్నారా" నవ్వింది రాజ్యం.

"బతికాను భగవంతుడా" అనుకున్నాడు రామం. కాస్త హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. శేఖరం ఆఫీసుకి వెళ్ళాడు.

*　　　　*　　　　*

"కాదు - రాజ్యం - స్నేహితుడు - ఇబ్బందిలో ఉన్నపుడు వదిలి వెళ్ళిపోతే బావుంటుందా - మనం రాకపోతే ఏ కష్టం పడేవాడో - మరి -" బతిమాలుతున్నట్టు ఉంది రామం గొంతు. రాజ్యం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వెంటనే నవ్వింది. "అయినా మీకు ఈ హనీమూన్ ఏమిటి - మీ పెద్దత్తయ్యచేత బొబ్బట్లు చేయించుకొని, హాయిగా తింటూ కూర్చోక" ఇద్దరూ పక పకా నవ్వుకున్నారు.

*　　　　*　　　　*

మూడు రోజులయింది. వచ్చినప్పట్నుంచీ వండటం. పనిచేయడం, మధ్యలో కంచాల దగ్గర, నీళ్ళ దగ్గర పిల్లల పేచీలు తీర్చడం, వసంతా పూర్తయి రామం, రాజ్యం బయటి కెడుతూంటే "నేనూ వస్తా పిన్నీ" అంటూ వెంటపడే నాలుగేళ్ళ పిల్లాడు.

*　　　　*　　　　*

రాజ్యం విసిగిపోయింది. హనీమూన్ వద్దు. ఏమీ వద్దు. ఇల్లుచేరితే చాలు రెండు రోజులు విశ్రాంతి తీసుకుని తను రామం ఎవరి ఉద్యోగాల్లో వారు చేరిపోవచ్చు. ఎప్పుడు తెల్లారుతుందో, ఎప్పుడు శేఖరం భార్య ఇంటికొస్తుందో బాబూ - రాజ్యం జడ అల్లుకుంటూ అనుకుంది ఆ రోజు.

"అమ్మయ్య - నువ్వు రోజూ పంపే పత్యం భోజనం మా ఆవిడకి బాగా నచ్చింది సుమా - అదే చెప్పాను - నీ దగ్గర ఓ పూట వంట నేర్చుకోమని" శేఖరం కాఫీ చప్పరిస్తూ, ఎదురుగా వున్న రామాన్ని చూస్తూ నవ్వుతూ అంటున్నాడు రాజ్యం వినేలా.

"నిజం పిన్నీ. నువ్వు భలేగా పూరీలు చేస్తావ్ — ఈ రోజు ఆలూ కూర ఎంత బావుందో" - రాజుగాడి మాటలు.

రాజ్యానికి నవ్వాలో ఏడ్వాలో తెలియలేదు.

* * *

రామం, రాజ్యం ప్రయాణమయ్యారు - శేఖరం దంపతులు వీళ్ళకి చాలా చాలా క్షమాపణలు చెప్పుకున్నారు శ్రమ కలిగించినందుకు. శేఖరం భార్య పెట్టిన కొత్త చీర బాగానే ఉంది రాజ్యానికి. కాకపోతే ఈ హనీమూనే మరి?

"ఊటీలో వారం ఉండి ఆ తర్వాత బయల్దేరతామ్" అన్నాడు రామం శేఖరంతో.

"స్టేషన్‌కి రాలేకపోతున్నందుకు బాధగానే ఉంది. కానీ మా బాస్ ఉన్నాడు చూశావూ" — శేఖరం చెప్పబోతున్నాడు "ఫరవాలేదులే .... వెడతామ్" గబ గబా బయల్దేరాడు రామం హమ్మయ్యా అనుకుంటూ.

* * *

రామం కొన్న టిక్కట్లు చూసి విస్తుపోయింది రాజ్యం.

"నీ ముఖం — అలా చెప్పకపోతే ఎలా — మా హనీమూన్ యింతటితో అయిందని చెప్పడానికి నోరు రాక" — రామం చిరాగ్గా అన్నాడు.

"సరే – విశేషా లేమిటంటే మనవాళ్ళందరికీ ఇవన్నీ చెప్పేస్తాను" అంది రాజ్యం కసిగా.

"ఛా .... నువ్వేమీ మాట్లాడకు – నే చూసుకుంటాగా అన్నీ – ఈ పనసకాయలు, అగర త్తీలు, నీ మైసూరు సిల్కు చీర, ఈ చిన్నికృష్ణుడి బొమ్మ – ఇవన్నీ చూపించి మనం ఎంతో హాయిగా గడిపామని చెప్తాంలే. అంతే కాదు, డబ్బుకి వైర్ చేయకుండా, ఎక్కువ ఖర్చు చేయకుండా, ఏవో కొన్ని కొనుక్కున్నామని, మనం ఇద్దరం ఆదా చేసుకు హాయిగా బతకగలమని మనవాళ్ళంతా ఎంత సంతోషిస్తారో నీవు ఊహించలేవు. ఇప్పుడు – అయినా – ఇబ్బందిలో స్నేహితుణ్ణి ఆదుకున్నామనే తృప్తి చాలదూ రాజ్యం" అన్నాడు రాజ్యం కళ్ళలోకి చూస్తూ.

"సింగినాదం – ఎవరేనా వింటే నవ్వుతారు" – రాజ్యం కిటికీలోకి ముఖం పెట్టుకుని కూచుంది.

నిజానికి రామానికి బాధగానే ఉంది. ఎంతో సరదాపడి ఆకాశంలో విహంగాల్లా విహరించాలని కలలు కని, కలలు కని ఇంట్లో వాళ్ళతో కాస్త ఘర్షణ పడి ఇంత దూరం వస్తే – ఇదా హనీమూన్....!?

రామానికి ఏడుపొచ్చింది – కానీ మగాడు ఏడవకూడదుగా మరి – కంట్లో నిప్పు నలుసు పడిందని పక్కకి వంగి కళ్ళు ఒత్తుకున్నాడు.

ఎదురుగా సీట్లో వున్న బామ్మగారు వీళ్ళిద్దరినీ చూస్తోంది. ఎవరూ మాట్లాడకుండా ఎటో చూస్తున్నారు. బామ్మగారికి ఏమీ తోచక వీళ్ళని పలకరించింది. ఏవో మాటల్లో దింపింది.

"కొత్తగా పెళ్ళయిందేమో – పుట్టింటివారిని వదలలేక పాపం అమ్మాయి కాస్త బాధ పడుతోంది" అంది రాజ్యానికేసి జాలిపడుతూ చూస్తూ.

"అబ్బే – అదేం లేదండి – మా పెళ్ళయి అయిదేళ్ళయింది – మా ఇద్దరికీ ఉద్యోగాలు – పిల్లాడితో కష్టమని పసివాణ్ణి అమ్మగారింట్లో దింపి వస్తోంది.... అందుకు."

రామం మాట పూర్తి కాకుండానే "పాపం! ఏ ఉద్యోగాలో ఏమో-పిల్లాడిని దూరంగా ఉంచుకుంటారా" అంది.

రామం, రాజ్యం పక పకా నవ్వుకున్నారు.

ఇంతకుముందే ఎందుకు ఏడ్చారో, ఇప్పుడే ఎందుకు పగలబడి నవ్వుతున్నారో అర్థం కాని బామ్మగారు "వీళ్ళ గోల నా కెందు"కని పక్కకి చూస్తూ కూచుంది.

అలసిపోయిన హనీమూన్ దంపతుల్ని తొందరగా ఇంట్లో దించడానికి రైలు గబ గబా పరిగెత్తింది ఆ చీకట్లో.

* [తరుణ, ఆగస్టు, 1975] *